క్లుప్తంగా

గ్రామాల్లో పైడిమాంబ ప్రచారరథం



చంద్రంపేటలో పైడిమాంబ ప్రచారరథం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ, చంద్రంపేట, టిక్కలి, తదితర గ్రామాల్లో విజయనగరం పైడిమాంబ ప్రచార రథాన్ని ఊరేగించారు. పైడిమాంబ విశిష్టత, జాతర మహోత్సవాలపై ఆయా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పందిర్రాట నిర్వహిస్తామని, వచ్చే నెల 14న తోలేళ్ల సంబరం, 15న సిరిమానోత్సవం జరిపిస్తామని ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో భక్తులు భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

నగరంలో వర్షం



రింగ్‌రోడ్ ఐస్ ఫ్యాక్టరీ కూడలి సమీపంలో రోడ్డుపై చేరిన నీరు

విజయనగరం: జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి భానుడు వేసవి మాదిరిగా తన ప్రచండ రూపాన్ని ప్రదర్శించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయితే మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా నగరమంతా కారు మబ్బులు కమ్మి సుమారు అరగంట సేపు భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారితో పాటు చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ పద్మావతి, కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద నున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించి నిర్వహించిన లెక్కింపులో 88,269 రూపాయల నగదు లభించినట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పద్మావతి, ఇన్‌స్పెక్టర్ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి, అర్చకులు సోమశేఖర్ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ద్వారపూడికి కలెక్టర్ రాక

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి గ్రామానికి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం రానున్నారని ఎంపీడీఓ చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రామంలో మొక్కలు నాటనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్‌సరఫరా నిలిపివేత

విజయనగరం: విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూల్‌బాగ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో గల పల్లివీధి, చిన్నపల్లి వీధి, అద్దేపల్లివారి వీధి, చిక్కాలవీధి, కొణిసి వీధి, కోలగట్లవారి వీధి, అంబటిసత్రం జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదేవిధంగా కాటవీధి 11 కేవీ ఫీడర్ పరిధిలోని కాట వీధి పార్క్, బొందులగూడెం, అశోక్‌నగర్, రామకృష్ణ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. నిర్దేశిత సమయం అనంతరం సరఫరాను పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డెంకాడలో..

డెంకాడ: సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా మండలంలోని డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.సురేష్ బాబు తెలిపారు. డెంకాడ, గుణుపూరు, గుణుపూరుపేట, ఆర్.ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, చొల్లంగిపేట, డీఆర్ పాలెం, నగరపుపేట, పోతయ్యపాలెం, పెద తాడివాడ, పిన తాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఘనంగా బడ్డుకొండ జన్మదిన వేడుకలు

- రామతీర్థంలో ప్రత్యేక పూజలు
- పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు సన్యాసినాయుడు, చిక్కాల, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థాన సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు ఆధ్వర్యంలో ముందుగా రామస్వామి ఆలయంలో బడ్డుకొండ పేరిట ప్రత్యేక అర్చనలు జరిపించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి బడ్డుకొండకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ చేసిన కృషి మరువలేనిదన్నారు. అంతా ఏకతాటిపై నిలిచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు, సర్పంచ్ కంచరావు సూర్యకళ, నాయకులు సముద్రపు రామారావు, జమ్ము అప్పలనాయుడు, పంచాది శ్రీరాములనాయుడు, సంగంరెడ్డి జగన్నాథం, రేగాన శ్రీను, రాంబార్కి రామారావు, పతివాడ అప్పారావు, రేవళ్ల శ్రీనివాసరావు, రెడ్డి సత్యనారాయణ, అట్టాడ శ్రీను, భాస్కరరావు, కర్రోతు వెంకటరమణ, అంబళ్ల కిరణ్, పురుషోత్తం, గుంటమాని రాజబాబు, ఉమ, చనమళ్ల తులసి, చిక్కాల సంతోష్, నడుపూరి పరిసినాయుడు, కేపీ నాయుడు, పాలూరి తిరుపతిరావు, పప్పల సత్యంనాయుడు,మద్దిల వాసు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: మండల కేంద్రంలో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదినం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం డెంకాడ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు, సర్పంచ్‌లు పతివాడ గౌరి, కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, లెంక లక్ష్మణరావు, పైల ముత్యాలరావు, ఎంపీటీసీ సభ్యుడు పొంతపల్లి జగన్నాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల సత్యం, బడ్డుకొండ రమేష్, బమ్మిడి వెంకటరమణ, బుగత రమణ, తొత్తడి శ్రీను, బడుకొండ రామునాయుడు, వాళ్లె వెంకటరావు, బాలి సత్యనారాయణ, సారిక గౌరి, పతివాడ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ : పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పూసపాటిరేగ: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తదితరులు

ఘనంగా ..

పూసపాటిరేగ : మండల కేంద్రమైన పూసపాటిరేగలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వృద్ధులు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పతివాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. మాజీ శాసనసభ్యుడు అప్పలనాయుడు నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించి ప్రజల అభిమానం చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, బొల్లు రమేష్, దాడిశెట్టి త్రినాథరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పిన్నింటి ఎల్లంనాయుడు, మహంతి లక్ష్మణరావు, శాంతాటి శ్రీనివాసరావు, రౌతు సాయి కుమార్, టి.సీతారాం, కోట్ల రఘు, మొంగం నాగబాబు, ఎల్లాజీ, తాడిశెట్టి బాబు, కె. శ్రీరాములు, ఎడ్ల రామకృష్ణ, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, డి. ఈశ్వరరావు, ఎల్లన్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు, తదితరులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం..



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

- వివిధ పాఠశాలల్లో విద్యార్థుల స్వచ్ఛత ప్రతిజ్ఞ

విజయనగరం: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం విజయనగరంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞను విజయనగరం కార్పొరేషన్ అధికారులు చేయించారు. కార్పొరేషన్ పరిధిలోని ఆరు సర్కిల్ ప్రాంతాలలో ఉన్న ఆరు పాఠశాలల్లో ప్రతిజ్ఞా కార్యక్రమాలు చేపట్టారు. బాబామెట్టలోని బాలికల పాఠశాల, కేంద్రియ విద్యాలయం, బీపీఎం స్కూల్, కంటోన్మెంట్ స్కూల్, వీటీ అగ్రహారం స్కూల్, పువ్వాడ స్కూల్ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బీపీఎం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పారిశుధ్య పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు రేపు

నెల్లిమర్ల: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఈనెల 21న మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు ఎం. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం వికాసతరంగిణి, మహిళా ఆరోగ్యవికాస్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు శిబిరం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 89859 12112 (ఇందిరాబాల), 93472 76094 (చరితాదేవి) నంబర్లను సంప్రదించాలని కోరారు.

రీమాపేటలో గ్రామసందర్శన నేడు

విజయనగరం రూరల్: మండలంలోని రీమాపేటలో గ్రామ సందర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి అరుణకుమారి హాజరుకానున్నారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొవాలని సూచించారు.

సింగవరంలో..

డెంకాడ: మండలంలోని సింగవరంలో గ్రామ సందర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి తెలిపారు. మండల అధికారులు గ్రామంలో పర్యటించి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

జూట్ మిల్లు తెరిపించాలి..

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని నెల్లిమర్ల జూట్ మిల్లును వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మూడు నెలలుగా ముడిసరుకు కొరత పేరిట స్థానిక జూట్ మిల్లును మూసివేశారన్నారు. దీంతో కార్మిక కుటుంబాలు ఆకలి కేకలతో అలమటిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మిల్లును తెరిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి జూట్ మిల్లు తెరిపించాలని కోరారు.

పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- నగర సుందరీకరణకు ప్రతిఒక్కరి సహకారం అవసరం
- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: నగర పరిధిలో పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో సినీ థియేటర్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు కోచింగ్ సెంటర్లు, విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరాన్ని పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఇందులోభాగంగానే నగర వ్యాప్తంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక మాధ్యమాలలో తమ సంస్థల ప్రచారం చేసుకోవాలని సూచించారు. అధీకృత హోర్డింగుల్లో తప్ప రోడ్లపై కర్రలు పాతి వాటికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ అమ్మాజీరావు, ఫిలిప్, తదితరులు పాల్గొన్నారు.

'దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలి'



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడైన రాహుల్‌గాంధీపై బీజేపీ మిత్ర పక్షాలు దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మిత్ర పక్షాలకు వ్యతిరేకంగా గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, బీజేపీ మిత్రపక్షమైన శివసేన పార్టీ (షిండే వర్గం) శాసనసభ్యుడు సంజయ్ గైక్వాడ్, ఇతర బీజేపీ నాయకులు నీచమైన ఆరోపణలు చేశారన్నారు. ఇటువంటి ఆరోపణలు మానుకోకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ గొప్ప విలువలతో కూడిన పార్టీ అని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పార్టీ నాయకులు సరగడం రమేష్‌కుమార్, సుంకరి సతీష్‌కుమార్, డాక్టర్ గేదెల తిరుపతి, షరీఫ్, శ్రీనివాస్‌రావు, కరీం, బంగారునాయుడు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మా దారి సంగతి తేల్చాకే పనులు చేయండి

- ఆర్ఓబీ పనులు అడ్డుకున్న రిక్షాకాలనీ, కొత్తఅగ్రహారం వాసులు
- సర్వీస్ రోడ్డు లేకుండా ఆర్ఓబీ ఎలా నిర్మిస్తారు?
- 15 అడుగులు సర్వీస్ రోడ్ సదుపాయం కల్పించాలని డిమాండ్



రాజాం రోడ్‌లో ఆర్ఓబీ పనులను అడ్డుకుంటున్న రిక్షాకాలనీ, కొత్తఅగ్రహారం వాసులు

చీపురుపల్లి: రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు బాగానే ఉంది.. కానీ మా దారి సంగతి ఏమిటో ముందు తేల్చండి.. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే తమ గ్రామాలకు ఎలా రాకపోకలు సాగించాలి?.. కేవలం నాలుగైదు ఇళ్ల కోసం ఏకంగా నాలుగైదు గ్రామాల రాకపోకలను లేకుండా చేస్తారా? ఎట్టి పరిస్థితుల్లోనూ తమదారి సంగతి తేల్చకే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరపాలని రిక్షాకాలనీ, కొత్త అగ్రహారం నివాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ రెండు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు గురువారం పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎల్.దామోదర్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఆర్‌అండ్‌బీ అధికారులను పిలిపించి చర్చలు జరిపారు. పట్టణంలోని విజయనగరం-రాజాం ప్రధాన రోడ్డులో ఉన్న పురాతన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పాడైన నేపథ్యంలో భారీ వాహన రాకపోకలను నిషేధించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్ఓబీ నిర్మాణానికి రూ.13 కోట్లు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రాజాం రోడ్‌లో గాంధీబొమ్మ కూడలి తరువాత కొత్తఅగ్రహారం, రిక్షా కాలనీతో పాటు గరివిడి మండలంలోని కె.ఎల్.పురం, కందిపేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించే రహదారి ఉంది. ప్రస్తుతం ఆర్ఓబీ పనులు పూర్తయితే ఈ రోడ్డుపై రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. కనీసం అత్యవసర వేళ అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేదు. సర్వీసు రోడ్డు ఏర్పాటుచేసేవరకు పనులు చేస్తే ఊరుకోబోమని తేల్చిచెప్పారు. ఎస్ఐ దామోదర్, ఆర్‌అండ్‌బీ డీఈ రవిశంకర్‌లు మూడు రోజుల్లో సంబంధిత రైల్వే కాంట్రాక్టర్లు, రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'ఎయిర్‌పోర్టుకు అల్లూరి' పేరుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు సీతారామరాజు

విజయనగరం: జిల్లాలోని భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌కు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును నిర్ణయిస్తూ రాష్ట్ర క్యాబినెట్ ప్రకటించడం హర్షించదగ్గ విషయమని విజయనగరం జిల్లా క్షత్రియ పరిషత్ ప్రతినిధులు తెలిపారు. గురువారం నగరంలోని క్షత్రియ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమత్స సీతారామరాజు, సాగి సీతారామరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మన్యంవీరుడి పేరును ఖరారు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర కన్వీనర్ గొట్టుముక్కల రఘురాజు, కో కన్వీనర్ బుద్ధరాజు శివాజీ, జిల్లా కన్వీనర్ కేఆర్‌కే రాజు మాట్లాడుతూ.. రాజధాని విజయవాడలో అల్లూరి స్మృతివనం ఏర్పాటు చేయడంతో పాటు నిరుపేద క్షత్రియులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూత్ పరిషత్ అధ్యక్షుడు శేఖర్ రాజు, కార్యదర్శి కె. లక్ష్మీపతివర్మ, క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి జిల్లా కన్వీనర్ జీఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే..

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో జరుగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని వివిధ ప్రాంతాలలో గురువారం పర్యటించి జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. కేఎల్ పురం, ఆర్టీసీ కాలనీ, ఉడా కాలనీ, అలకానంద కాలనీలలో రహదారుల నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే అలకనంద కాలనీలో ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించి, అక్కడ ఉండే పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రహరీ నిర్మించండి..



వార్డు పర్యటనలో అధికారులకు సమస్యలు వివరిస్తున్న స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ గౌస్

విజయనగరం: వార్డు పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు అన్నారు. కాటవీధి ఉర్దూ స్కూల్ నుంచి గురువారం ప్రారంభమైన వార్డు పర్యటనలో పాఠశాలల స్థితిగతులు, పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ప్రధానంగా ఉర్దూ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కాలువల్లో పైపుల లీకులు వంటి సమస్యలను అధికారులు గుర్తించారు. స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్ మాట్లాడుతూ.. అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమస్యలను కూడా త్వరగా పరిష్కరిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు మాట్లాడుతూ, వార్డు పర్యటనలో భాగంగా గుర్తించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.